# చీకటి దేశం

రాధ నాలుగోక్లాసు చదువుతోంది. రాధంటే వాళ్ళమ్మకీ నాన్నకీ చాలాముద్దు. నాలుగోక్లాసు చదువుతోందని కాదు. చదవకపోయినా ముద్దే బడికెళ్ళేముందు వాళ్ళమ్మ రాధకి నీళ్ళుపోసి, తలదువ్వి, గౌనువేసి "జాగ్రత్తగా వెళ్లిరా తల్లీ" అని నరిసిగాడిని సాయమిచ్చి పంపిస్తుంది. నరిసిగాడు రాకపోతే మరెవరేనా దిగబెట్టి రావలసిందే. "దగ్గిరేకదూ బడి, ఒక్కర్తే వెళిపోతుందిలే" అని వాళ్లనాన్న ఎప్పుడేనా అంటే "అమ్మో చిన్నముండ, ఒక్కర్తె ఎలా వెళ్లుతుందండీ, మీకు వెర్రిగాని, అయినా బడిపిల్లలు పెంకివెధవలు-దారిలో అమ్మాయి నెవరేనా పలకతో తలమీదకొడితే, పెనిసిలుతో కంట్లో పొడిస్తే ఏందారి? మీరెళ్ళి దిగబెట్టిరండి - లేదా; నే వెళ్లొస్తాను" అంటుంది వాళ్లమ్మ—వాళ్లమ్మ నోటికి తాళం వెయ్యలేం—

రాత్రి ఎక్కాలు కంఠతాపెడుతూంటే వాళ్లమ్మ రాత్రిళ్లు ఎక్కువసేపు మేలుకోవద్దని కోప్పడి పడుకోబెట్టింది-కాని రాధ ఒకంతకి నిద్దరపోదు—వాళ్లమ్మని మాటలతో కాల్చుకుతింటుంది—

"అమ్మా, నిద్దరరాదే" అన్నది రాధ—

"గట్టిగా కళ్లు మూసుకుపడుకో తల్లీ—అదే వస్తుంది" అన్నది వాళ్లమ్మ—

"అమ్మా, ఎక్కాలు చదవకపోతే మాష్టారు కొప్పడు తారేమో రేపు" అని సందేహంగా అంది రాధ.

"వెధ వెక్కాలు, రాకపోతే పోనీలే తల్లీ—నువ్వేం ఉద్యోగాలు చెయ్యనక్కర్లేదు - ఊళ్ళేలక్కర్లేదు— మీ నాన్నగారు, మేష్టరుగారికి కబురుపెడతారులే ని న్నేమీ అనొద్దని" అంటూ రాధవీపుమీద చేత్తో జోకొట్టింది వాళ్ళమ్మ.

"నాన్నంటే మాష్టారుకి ఎందుకూ భయం" మళ్ళీ అడిగింది రాధ.

"మీ నాన్న తాశీల్దారు—అంచేత ఊళ్ళో అంతా భయపడతారు. ఇంక పడుకో—"

"మా మాష్టారు చాలామంచివారు" అంటూ గొణుగు తోంది రాధ.

"పడుకో అమ్మా, ఇంక నన్ను విసిగించక—"

కాని రాధకి నిద్రపట్టలేదు. పక్కకి వొత్తిగిల్లి కిటికీ లోంచి చూస్తోంది.

చీకటి కంబళిలా నల్లగాఉంది. అవతల గుడిశలోంచి రామిగాడు దీపపుబుడ్డిముందు కూర్చుని ఎక్కాలు గట్టిగా బట్టీవేస్తున్నాడు. రామిగాడూ నాలుగో క్లాసే. కాని రాత్రిళ్లు చదవకపోతే వాళ్ళనాన్న తంతాడు. రామిగాడికి పదహారెక్కాలు కంఠతా వచ్చు. ఏ బీ సీ డీ లన్నీ రాసీ గలడు. కాకీ, మాంసపుముక్కా కథ పుస్తకం చూడకుండా అప్పచెప్పగలడు. పరీక్షల్లో ఫస్టుమార్కు వచ్చింది. క్లాసులో పిల్లలకి వాడంటే భయం. వాడి నెవరూ ఏమీ అనరు. ఎవరేనా అంటే జల్లలుకొడతాడు. నల్లగా ఎలుగుబంటిలా

ఉంటాడు. రాధ వాడికోసారి తెల్లకాగితా లిచ్చింది. అంచేత రాధంటే వాడి కిష్టం.

మన్నాడు పొద్దున్న రాధ బడికి బయలుదేరింది— రామిగాడు వీధిగుమ్మంలోకొచ్చి "రాధా వస్తావా బడికి"అని కేకేశాడు. రామిగాడు లాగు, వాళ్ళనాన్న చిరిగినబనీను వేసుకున్నాడు. తలకీ ముఖానికీ నూనె రాసుకున్నాడు— ఎండలో వాడి శరీరం నల్లటి గాజుపెంకులా మెరుస్తోంది—

"కొత్త కారొచ్చింది. మా నాన్న వస్తున్నారు నన్ను దిగబెట్టడానికి" అన్నాది రాధ—

"ఒస్, పిరికి—నే నుంటే ఇంకా ఏం భయం" అని గర్వంగా నవ్వేడు రామిగాడు—

"ఇక్కడున్న బడికి కారెందుకూ ?" రాధనాన్నగారు వీధిలోకొచ్చి రామిగాడినిచూసి "వీ డెవడు—వెధవ"అన్నారు.

"రామిగాడు"

"నీగ్రో వెధవ—ఫో" అన్నారు వాళ్ళ నాన్నగారు— రామిగాడు పరిగెత్తేడు—

"నీగ్రో అంటే ఏమిటి నాన్నా" అన్నాది రాధ—

"నీగ్రో అంటే వీడిలాగే నల్లగావుండే వెధవలన్న మాట"అని నవ్వేడు వాళ్ళనాన్నగారు. రాధకూడా నవ్వింది— "అహోయ్, నీగ్రో" అని మళ్ళీ నవ్వింది—

బడిదగ్గర రావిచెట్టుకింద పిల్లలంతా, పెంకుముక్క లేరి వెనుకనున్న చెరువులోకి విసురుతున్నారు—రామిగాడు రాధ దగ్గరకెళ్ళి 'ఎక్కాలు వచ్చా' అన్నాడు; రాధకి నవ్వొచ్చి

'అహోయ్, నీగ్రో' అని పకపకమని నవ్వింది; పిల్లలంతా రామిగాడిచుట్టూ చేరి 'నీగ్రో, నీగ్రో' అనే కేకలేసి నవ్వేరు; రామిగాడికి కోపమొచ్చి, తేలుకుట్టినట్లు కేకలేశాడు. పిల్లలు మరింత ఉడికించారు; ఇంతలో బడిగంట కొట్టేరు.

క్లాసులో మాష్టరుగారు, రామిగాడిని ఎక్కాలు అప్ప చెప్పమన్నారు. రామిగాడు లేచి నిలుచుని, మాష్టరుగారి పౌడుంవాసనకి ఒక తుమ్ము తుమ్మేడు; వెనకాతలనుంచి ఎవడో 'నీగ్రో' అన్నాడు. పిల్లలందరూ నవ్వేరు; అందరూ మళ్ళీ అన్నారు.

"ఏమిటా అల్లరి" అని మాష్టరుగారు కోపంగా కసిరేరు. రామిగాడు ఏడుపుమొహం పెట్టి "పిల్లంతా నన్ను నీగ్రో అంటున్నారు" అన్నాడు. "అలాగా" అని మేష్టరుగారు బెత్తంపట్టుకుని ముందుకొచ్చేరు. పిల్లలు కిక్కురుమనకుండా కూర్చున్నారు; రామిగాడు వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. పిల్లలందరికీ జాలేసింది; రామిగాడు ఏడవడం వాళ్ళిదే మొదటిసారి చూడ్డం; మాష్టరు మెల్లిగా చెప్పడం మొదలుపెట్టేరు; "నీగ్రో అంటే మీకు తెలుసునా? ఆఫ్రికా అనే దేశంలో మనలాగే ఉండే మనుషులు; వాళ్లకి ఎండ ఎక్కువ. అంచేత నల్లగావుంటారు; వాళ్ళు పాపం, చాలా బీదవాళ్ళు; వాళ్ళకి బట్టలు, లేవు; తిండానికి అన్నంలేదు; అంచేత వాళ్ళది చీకటి దేశం అన్నారు.

తెల్లగావుండే ఇంగ్లీషువాళ్ళు వాళ్ళని చాలా బాధలు పెడుతున్నారు. వాళ్ల పిల్లలు రామిగాడిలాగే మంచి చురు

కైనవాళ్ళూ, బలమైనవాళ్ళూను; మన రామిగాడు ఎంత బలమైనవాడు” అన్నారు. పిల్లలందరికీ రామిగాడిబలం తెలుసు; వాడు ఒకనాడు పందెంవేసి చేత్తో మాష్టరుగారి టేబిలు విరగ్గొట్టేశాడు. మళ్లీ మాష్టరుగారు చెప్పడం మొదలుపెట్టేరు.

“కాని పాపం వాళ్ళు చాలా బీదవాళ్ళు; వాళ్లని బాధపెడుతూన్న ఇంగ్లీషువాళ్ళని మీరు వెక్కిరిస్తారా లేకపోతే, పాపం నీగ్రోపిల్లలిని వెక్కిరిస్తారా? మీ చిన్నతమ్ముడిని ఎవరేనా కొడితే మీ రేంచేస్తారు?” అన్నారు మేష్టరుగారు.

“మా అమ్మతోటి నాన్నతోటి చెపుతాం” అన్నారు పిల్లలు.

“అంచేత రామిగాడిని నీగ్రో అని పిలవకూడదు; తప్పు; రామిగాడు చాలా మంచివాడు; వాడికి పదహారెక్కాలు కంఠతావొచ్చు; మీ కొచ్చునా?” అన్నారు. పిల్లలు రామిగాడినిచూసి సిగ్గుపడ్డారు. రామిగాడూ, మేష్టరుగారూ మంచివాళ్లు; మేష్టరుగారు నీగ్రోలగురించి ఇంకా కొన్ని కథలు చెప్పేరు; ఆయనక్లాసులో ఎవరూ అల్లరి చెయ్యరు; ఎప్పుడైనా, ఎవరైనా మేష్టరుగారి పొడుండబ్బి దాచేస్తే “నా పొడుండబ్బీ ఇచ్చినవాళ్లకి మంచికథ చెప్తాను” అనేవారు. పిల్లలు ఆయన పొడుండబ్బీ ఇచ్చేసి కథ చెప్పమనేవారు. ఆయన ఎన్నో కథలు చెప్పేవారు.

కాని నెలరోజులదగ్గరినుంచీ ఆ మాష్టరుగారు బడికి రావడం మానేశారు. ఎంచేతో ఎవరికీ తెలీదు; కొత్తమాష్టరుగారు వచ్చారు. కాని ఆయనకి కథలు రావు; పిల్లలని చింతరువ్వతో కొడతారు; గోడకుర్చీ వేయిస్తారు; గుంజీలు తీయిస్తారు; కొత్తమాష్టరుగారు మంచివారుకారు.

కొత్తమాష్టరుగారు ఎక్కాలు రాలేదని రాధని కోంపడ్డారు. రాధ ఏడుస్తూ ఇంటికొచ్చేసింది. వాళ్ళమ్మ కొత్తమాష్టరుగారిని తిట్టింది.

రాత్రి రాధ భోంచెయ్యలేదు. పాతమాష్టరుగారున్నప్పుడు ఎక్కాలు కంఠతావచ్చాయి. కొత్తమాష్టరుగారు రాగానే మరచిపోయింది. రాధ మంచంమీద కూర్చుని గోడమీద బల్లిని చూస్తూంది మతిపోయినట్లు; రాధ నాన్నగారువచ్చి అడిగారు. "అన్నం ఎందుకుతినలేదు తల్లీ, పోనీ పాలుతాగు"

"అలాగే నాన్నగారు, పాలు తాగుతాను; కాని మా పాతమాష్టరుగారు ఎందుకు బడిమానీశారు నాన్నా" అని అడిగింది రాధ.

"వాడా, వాడు క్లాసులో రాజకీయాలు చెప్పేడుట పిల్లలకి"

"రాజకీయాలంటే ఏమిటి నాన్నా"

"అంటే నెహ్రూగారిని తిట్టేడట"

"నెహ్రూ అంటే ఎవరు నాన్నా, నీగ్రో?"అంది రాధ.

"ఛీ కాదమ్మా"

"మరెవరు, ఇంగ్లీషువాడా"

"కాదమ్మా, మనందరికీ పెద్ద అన్నమాట. అదిగో ఆ పటంలో ఉన్నారే ఆయన" అంటూ గోడమీదవున్న పటం చూపించారు. మెళ్లో పూలదండ వేసుకొని నవ్వుతున్నారు గోడమీద నెహ్రూగారు.

"ఆయనా, ఆయన్ని తెలుసు నాన్నా; అల్లప్పుడు పెద్ద మీటింగుకొస్తే అమ్మ చూపించింది. మా పాతమాష్టరు ఆయన్నుగురించి కథ చెప్పలేదు నాన్నా అయ్యో, నీగ్రోల గురించి చెప్పేరు" అంది రాధ పెద్ద అన్యాయం జరిగినట్లు కళ్ళు పెట్టి.

"నీకు తెలీదులే. పాలు తాగి పడుకో" అని వాళ్ళ నాన్నగారు వెళ్ళిపోయారు. రాధకి నిద్రపట్టలేదు; పాతమాష్టరుగారు చెప్పిన కథలు జ్ఞాపకానికి వస్తున్నాయి. కిటికీలోంచి చూస్తే అవతల చాలా చీకటిగావుంది; ఆఫ్రికా చీకటిదేశం ఇలాగే ఉంటుందికాబోలు ననుకుంది; దూరంగావున్న గుడిశలో రామిగాడు దీపపుబుడ్డిముందు ఎక్కాలు చదువుతున్నాడు.

—o—